మహాకవి సింహాసనము

ప్రాచీన గాథాలహరి

కాళిదాస మహాకవి రాజప్రాసాద 'సింహ ద్వారంలో అడుగుపెట్టిన వార్త వినగానే విక్రమాదిత్య చక్రవర్తి స్వయంగా ప్రాసాద సింహద్వారందాకా నడిచివెళ్ళి మహాకవిని సగౌరవంగా తన రహస్య మంత్రాగారంలోనికి తోడుకుపోయాడు. మంత్రాగారంలో ప్రవేశిస్తూనే, తనసరసనే స్వర్ణసింహాసనం మీద కూర్చోబెట్టుకున్నాడు.

కవి మొట్టమొదట చక్రవర్తి సింహాసనంమీద కూర్చోడానికంతగా ఇష్టపడలేదు. అపార్శ్వంలోనే ఉన్న మరొక సింహాసనంమీద కూర్చోబోయాడు. కాని చక్రవర్తి దానికంగీకరించలేదు. ఎంతో బలవంతం చేసి కవిని తన సరసనే కూర్చోబెట్టుకున్నాడు:

"మీకు నాసరసన కూర్చోవడానికి మనస్కరించకపోతే పోనీ నేనే ఆసింహాసనం మీద కూర్చుంటాను!"

అని వ్యంగ్యంగా చమత్కరించి ఆపక్కనున్న మరొక సింహాసనం మీద కూర్చోబోయాడు.

"ఎంతమాట!"

అన్నట్టుగా కాళిదాసకవి ఆశ్చర్యపడి చక్రవర్తినే బలవంతంగా తనసరసన కూర్చోబెట్టుకున్నాడు.

వెంటనే వారికనతిదూరంలో ఒయ్యారంగా నిలబడిన తాంబూల కరండవాహిని కవిచక్రవర్తికీ, చక్రవర్తికీ కర్పూర తాంబూలాలందించింది. వారికిరుపార్శ్వాలలోను నిలబడిన చామరగ్రాహిణు లిద్దరు కదలీకదలనట్టుగా వింజామరలు వీచారు. ఆ వింజామరల కదలికలలో కాళిదాసకవి భుజంపై వేలాడే ఉత్తరీయాంచలం అలవోకగా జీరాడింది.

విక్రమాదిత్య చక్రవర్తి ఏదో ఇష్టాగోష్ఠి ప్రసంగం ప్రారంభించాడు. మహాకవి మధ్యమధ్యన ఛలోక్తులలో చక్రవర్తి కుల్లాసం కలిగిస్తూ తాంబూలసేవ కుపక్రమించాడు.

చక్రవర్తి ఆప్యాయంగా ఆదరించి గౌరవించడం మహాకవికి కొత్తకాదు. అయితే ఈనాడీ విధంగా గౌరవించడంలో కవికొక చూపువాని అత్యాదరం గోచరించింది.

వారిద్దరి ఇష్టాగోష్ఠి కొంతకాలం అలాగలాగ అనేక విషయాలమీదికి సాగిపోయింది.

అంతలో పరిసరోద్యానంలో ఒక కోయిల పిలుపు వినిపించింది. చక్రవర్తి ఇష్టాగోష్ఠి ప్రసంగం అత్యాసక్తితో ఆలకిస్తున్న మహాకవి హృదయం అప్రయత్నంగా పరిసరోద్యానవనం వైపు తిరిగింది.

అపరాహ్ణంకాలంలో పిలతెమ్మెరలలో చెలరేగిన పండుటాకులు కొన్ని నెమ్మదిగా గలగలలాడుతూ గిరగిరా తిరిగాయి. మామిడి పూత పుష్పొడి రాలినట్లు జలజల రాలింది. దూరం దూరంగా ఉజ్జయినీనగరం ఒరుసుకొని ప్రవహించే శిప్రాతరంగాల రొద తుమ్మెదబారుల రొదలో లీనమై సన్న సన్నంగా వినిపించింది.

మహాకవి మనస్సాకింత అన్యాసక్తంగా ఉన్నదని గ్రహించిన చక్రవర్తి కాళిదాస కవికింకా దగ్గరగా జరిగి కూర్చుని తిరిగి తన ప్రసంగం ప్రారంభించాడు.

వారిద్దరు ఏదో రహస్య ప్రసంగంలోనికి దిగారని గ్రహించి తాంబూల కరండవాహిని తనచేతినున్న తాంబూల కరండకం వారి సమీపంలో ఉంచి అభ్యంతర మందిరంలోనికి వెళ్ళిపోయింది. అది చూచి చామరగ్రాహిణు లిద్దరూ కూడా ఆమె వెంట వెంటనే లోపలికి వెళ్లిపోయారు. అంతలో మంత్రాగారంలో అంతటా అగరుధూమ మాలికలల్లిబిల్లిగా అలుకొన్నాయి.

౨

మరి కొంతసేపటికి వారిద్దరి ప్రసంగం క్రమక్రమంగా కుంతల దేశాధిపతి విజయేశ్వరవర్మ వైపు తిరిగింది:

"ఈ విజయేశ్వరవర్మ విషయమేం నాకేమి చెయ్యడానికీ పాలుపోకుండా ఉంది." అన్నాడు చక్రవర్తి.

"మహామాత్యుల నొక్కమారు రాయనదగ్గరకు రాయబారం పంపిస్తేనో?"

అన్నాడు కాళిదాసకవి. పిమ్మట చక్రవర్తి అభిప్రాయం తెలుసుకోవాలనే కుతూహలంతో అలాగే నిశ్చలంగా విక్రమాదిత్యుని వైపు చూచాడు:

"ఇది మహామాత్యులవల్ల సాధ్యపడకపోవడంవల్లనే నేనింతగా మథనపడుతున్నాను."

"మరి గత్యంతరం?" అన్నట్టు కవి బొమముడి విరిచాడు. చక్రవర్తి దానికి సమాధానం ఇచ్చాడు:

"కుంతల దేశం మన శత్రుమండలానికత్యంత సన్నిహితమైన రాజ్యం. అదీ గాక కుంతలాధిపతి మనయెడల వైముఖ్యం అవలంబిస్తున్నటు మహామాత్యులు నిరూపిస్తున్నారు. ఈ సందర్భంలో దానభేద దండోపాయాలు ప్రయోగిస్తే అతనికిమనయెడల మరింత వైముఖ్యం ఏర్పడవచ్చును. అది మన శత్రుమండలానికి మరింత దోహదకారి కావచ్చును ఈ సందర్భంలో మన సామ్రాజ్య సుస్థిరతకు కుంతలేశ్వరునితో మైత్రీ బాంధవ్యాలత్యంత ముఖ్యమైనవి అవి కేవలం సామోపాయం మూలంగానే సాధ్యాలు"

అని చక్రవర్తి ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. కవికా ప్రసంగంతో ఆ విషయం అంతా అవగతమై పోయింది. కొంచెంసేపు మౌనం అవలంబించి మాచాయగా ప్రశ్నించాడు:

"కుంతలాధిపతి దగ్గర యుక్తవయస్కురాలు, రూపవతి అయినటువంటి ఒక చక్కని కన్యక ఉన్నదని విన్నానే."

"అవును. నిజమే."

"ఆమె మన యువరాజ కుమారుని కన్ని విధాలా తగిన కన్యకేగదా!"

"అవును, నా అభిమతమున్నూ అదే!... అయితే కుంతలాధిపతికీ, మనకు మధ్యన ఏర్పడిన వైముఖ్యమే దీని కొక పెద్ద అవ

★ మహాకవి సింహాసనం ★

కోపంగా ఉంది...మీరు కొంచెం శ్రమ తీసుకుంటే—"

అని చక్రవర్తి తన ప్రసంగం అంతటితో ముగించివేశాడు. కవి కొంచెం ఆలోచించాడు:

"పోనీ మిగిలిన అమాత్యులెవరయినా ఈ విషయంలో దౌత్యం నిర్వహిస్తే-"

అని తనఅభిప్రాయం కొంచెం సందిగ్ధంగా వ్యక్తీకరించాడు.

"మహామాత్యులే సాధించలేనప్పుడిక ఇతరమాత్యులవల్ల ఏమవుతుంది!...అయినా ఈ కుంతలేశ్వర దౌత్యం మీకంతగా రుచించనట్టుందే!"

అని చక్రవర్తి ఒక్క చిరునవ్వు చిలకరించాడు:

"మీపరిచయం భాగ్యం కలిగిన అనంతరం ఇతరరాజన్యులతో గోష్ఠీ ప్రసక్తి అంటే నాకంతగా రుచించనిమాట వాస్తవమే" అన్నాడు కవి." చక్రవర్తి చిరునవ్వింకా చెక్కిళ్ళదాకా విస్తరించింది:

"విజయేశ్వరవర్మ విషయం మీకంతగా సుపరిచితం కాదేమో! ఆయన కేవలం విద్వన్మణి!"

మహాకవి దానికేమి ప్రత్యుత్తరం ఈయలేదు.

"స్వయంగాకవి. పైగా కవితాప్రియుడు. అదిన్నీగాక ఆయన మీ విఖ్యాతివిని మిమ్మల్ని సందర్శించవలెనని కుతూహల పడుతున్నాడనికూడా విన్నాను. ఈ కారణాలన్నిటివల్ల తామే ఇది నిర్వహించవలెనని నా ప్రార్థన."

కాళిదాస కవికిప్పుడు విక్రమాదిత్యుని హృద్గతాభిప్రాయం విస్పష్టంగా అవగాహన అయింది. చక్రవర్తి కుంతలేశ్వరునితో మైత్రీ బాంధవ్యాలభిలషిస్తున్నాడు. అయితే ప్రస్తుతం కుంతలదేశాధిపతి విజయయేశ్వర వర్మ శత్రుమండలితో సంబంధ బాంధవ్యాలభివృద్ధి పొందించుకోవాలని సన్నాహాలు చేస్తున్నాడు. విక్రమాదిత్య చక్రవర్తి అది అరికట్టాలని సంకల్పించాడు. ఆ సంబంధ బాంధవ్యాలు తనతో కలుపుకోవాలని అభిలషిస్తున్నాడు. కుంతలాధిపతి కుమార్తెను తనకుమారునికిచ్చి వివాహం చేస్తే అదిబాగా సుగమం కాగలదని నిశ్చయించాడు. దానికి కుంతలేశ్వర దౌత్యం నెరపవలసినదని స్వయంగా అభ్యర్థిస్తున్నాడు.

కాళిదాస కవికా అభ్యర్థన కాదనడానికి మనసొప్పలేదు. విక్రమాదిత్య చక్రవర్తి అంతటి వ్యక్తి స్వయంగా అభ్యర్థించినప్పుడిక కాదనడం సముచితం కానేరదు. అందుచేత కవి కుంతలేశ్వర దౌత్యం నెరపవలెననే నిశ్చయించాడు. కాని తన అంగీకారం వెనువెంటనే చక్రవర్తికి తెలియజెయ్యలేదు. చక్రవర్తి అది గ్రహించాడు:

"మీరేదో కొంచెం సంశయిస్తున్నట్టున్నారు. స్వయంగా నా ప్రతినిధిగా మీరీ కుంతలేశ్వర దౌత్యం నెరపుతున్నప్పుడాయన చక్రవర్తి సముచితమైన గౌరవాదరాలతో మీ అడుగులకు మడుగులొగ్గవలిసిందే!"

"నేను నాగౌరవాదరాల విషయంకాదు ఆలోచించేది." అన్నాడు కవి.

చక్రవర్తి జిజ్ఞాసార్థకంగా బొమముడి విరిచాడు.

"నా అధికార పటాటోపం చూచి ఆయన మరింత బిగువులు పోతాడేమోనని నాభయం!"

అని కవి తిరిగీ ఆలోచనలో పడ్డాడు. చక్రవర్తికి క్షణకాలమేమీ పాలుపోలేదు.

కవి తిరిగీ తన అభిప్రాయం కొంచెం చూచాయగా తెలియజేశాడు:

"నేను కేవలం కవిమాత్రుడుగానే కుంతలేశ్వరాస్థానం సందర్శిస్తే?"

ఆ ఊహ చక్రవర్తికి బాగా నచ్చింది: "అవునవును. ప్రస్తుతానికదే సముచితమైన మార్గం మీరు కవి చక్రవర్తులు! మా సామ్రాజ్యం పరిమితం. మీది నిరవధికమైన కవితా సామ్రాజ్యం ఎలాంటి మకుటాధిపతులైనా మీకు సామంతులే!"

అంతమాత్రంచేత కాళిదాస కవి ఉబ్బి తబ్బిబ్బై పోలేదు ఒక్కమారుగా కలకల నవ్వాడు:

"ఆమకుటాధిపతులు రసజ్ఞులైనప్పుడే గదా మా ప్రాభావం!"

"కుంతలాధిపతి మాకు సామంతులనిపించుకోవడానికి కొంచెం వెనకాడుతున్నారు. కాని మీ ప్రాభవం కుంతలాలలో కూడా అవ్యాహతంగా చెల్లుబడి కాగలదు. దిగ్విజయీభవ!"

అన్నాడు చక్రవర్తి సౌహార్దం ఒలకబోస్తూ. దేశనామధేయాలు బహువచనాంతంగా ప్రయోగించడం గీర్వాణ సంప్రదాయం. అది గ్రహించి 'కుంతలాలలో' అనేపదంపై చమత్కరించాడు కాళిదాస మహాకవి:

"ఇంతవరకు మా సామ్రాజ్యం సుందరీమణుల మార్గకుంతలాలవరకే వ్యాపించింది. మీ శుభాశంసవల్ల అది కుంతలదేశ సుందరీమణుల మార్గకుంతలాల వరకు విస్తరించగలదేమో!"

ఆ చమత్కారంతో చకితుడైన చక్రవర్తి మహాకవిని సాదరంగా కౌగలించుకొని సగౌరవంగా రాజప్రాసాద సింహద్వారం వరకు సాగనంపాడు.

జీవితమును
మలబద్ధకము
భారముగా చేయనీయకండి

తలనొప్పులు, కోపిష్టితనము, ఆకలిమాంద్యము, మందగొడితనము ఇవన్నీ శరీరములోని అపరిశుద్ధతకు చిహ్నములుగా వచ్చును. కాని మలబద్ధకము మీ జీవితాన్ని పెద్ద భారముగా చేయవలసిన అవసరము లేదు. బ్రూక్లాక్స్ సేవించగనే తిరిగి సత్తువ చేకూరును. రుచికరమైన యీ చాకొలెట్ విరేచనకారి మలాశయము ఉత్తేజపరచి మలిన పదార్థమును తప్పక విసర్జనముగా వెడలగొట్టును. ఈ రాత్రి ఒక చిన్న ముక్క సేవించండి. రేపు ఎంత సుఖంగా, ఎంత హుషారుగా వుంటుందో గమనించండి.
కాని తప్పక మీరడిగేది బ్రూక్లాక్స్ అని మాత్రం రూఢిచేసుకోండి.

బ్రూక్లాక్స్
మిమ్ము రాత్రికి రాత్రి
సరిదిద్దును
ఏజెంట్లు:
మద్రాసు-1.
బ్రాంచి: 17/117, నాగేశ్వర

3

కాళిదాసమహాకవి శిష్య ప్రశిష్యగణంతో కలిసి కుంతలరాజధాని కల్యాణ నగరానికి విచ్చేయగానే నగర కవి విద్వాంసులలో ఒక అపూర్వమైన సంచలనం చెలరేగింది.

ఆమహాకవి రాజాస్థానాలు సందర్శించడం ఇంతవరకు వారెన్నడు వినిఉండలేదు. కుంతలదేశ విద్వాంసులలో కాళిదాస ప్రఖ్యాతి బాగా విస్తరించినా వారెవరికీ కవిసందర్శన భాగ్యం ఇంతవరకెన్నడు కలగ లేదు.

అందోళికాది వాహనాల కలకలంతో విచ్చేసిన ఆ మహావ్యక్తిని చూడగానే కల్యాణనగర విద్వాంసు లహమహమికతో తమ ఆతిథ్యం స్వీకరించవలసిందని మహాకవిని ప్రార్థించారు. కాళిదాసకవి ఎందరి ప్రార్థనలని మన్నించగలడు? చివరికి కుంతల రాజ్యాస్థాన విద్వాంసుడు మార్తాండభట్టు భవంతిలో విడిది చెయ్యడాని కంగీకరించాడు.

కుంతలరాజ్య ప్రధానామాత్యునికీ మహాకవి ఆగమన వృత్తాంతం మరింత వింతగా కనబడింది. విక్రమాదిత్య సభాలంకారమైన ఆ మహాకవికి కుంతలదేశాస్థానంవంటి సామాన్య సంస్థానం సందర్శించవలసినంత ఆవశ్యకత ఏదీ లేదని మహామాత్యుడు మంత్రిగుప్తుడు ముందుగానే గ్రహించివేశాడు దీనిలో ఏదో అంతరార్థం అంతర్నిహితమై ఉండితీరాలని అతడొక్క క్షణంలో ఊహించుకొన్నాడు. వెంటనే ఆ విషయం విజయేశ్వరవర్మకు తెలియజేశాడు.

కుంతలరాజ్యం విక్రమాదిత్య చక్రవర్తి విశాల సామ్రాజ్యానికి సరిహద్దులోనే ఉంది. అయితే ఉజ్జయినీ సామ్రాజ్యధోరణి కుంతలదేశానికంత సన్నిహితంగా కనబడకపోవడంవల్ల విజయేశ్వర వర్మ తనకెరుగుపొరుగు దక్షిణాపథ రాజ్యాలతో సంబంధ బాంధవ్యాలభివృద్ధి పొందించుకోవాలని నిశ్చయించాడు. ఆ పద్ధతి విక్రమాదిత్యుని వైమనస్యానికి దారి తీయగలదని అతనికి తెలియకపోలేదు. కాని మరి గత్యంతరం లేదనుకొని అతడామార్గం అవలంబించాడు.

కాని మహామాత్యుడు మంత్రిగుప్తుని కామార్గంఅంతగా రుచించలేదు విక్రమాదిత్య చక్రవర్తితో బలవద్విరోధం కుంతలరాజ్యం వంటి చిన్న రాజ్యానికి శ్రేయోదాయకం కాదని అతని భయం. అందుచేత ఏదో విధంగా చక్రవర్తితో స్నేహ బాంధవ్యాలభివృద్ధి పొందించుకోవాలని అతని అభిప్రాయం. బలవన్నృతి సంపా [illegible]

దాక్షిణాత్యరాజన్యు లెవరు తమవైపు తేరిపార జూడలేరని అతని ధైర్యం.

అయితే విజయేశ్వరవర్మకు, మహామాత్యునికీమధ్య ఏర్పడిన ఈదృష్టి భేదం ఇంతవరకు అనిశ్చితంగానే ఉండి పోయింది. మహాకవి రాకతో మంత్రిగుప్తుడు తిరిగీ తన అభిప్రాయం కుంతలేశ్వరునికి తెలుపుడు చేసుకొన్నాడు. విజయేశ్వరవర్మ ఎటూ తేల్చి చెప్పలేదు :

"ఇంతకీ ఆ కవీశ్వరు లిక్కడికి విచ్చేసిన కారణమేమో!"

"అది అవగాహన చేసుకోవాలనే నేను వారి సన్నిధికి వెడుతున్నాను"

"ముందువారి అభిప్రాయం గ్రహించండి."

అన్నాడు విజయేశ్వర వర్మ అంతేగాని అమాత్యుని కంతకంటె ఎక్కువ అధికారం ఇవ్వలేదు అయినా మంత్రిగుప్తుడా విషయం అంతటితో విడిచిపెటలేదు :

"ఒక వేళ వారి ప్రసంగంలో మన యెడల కొంచెం సౌమనస్యం గోచరిస్తే?

"దాని కేమి! అప్పుడు తిరిగీ ఈ విషయం పునర్విమర్శించుకోవచ్చును"

అని విజయేశ్వరవర్మ ఆ ప్రసంగం అంతటితో ముగించివేశాడు. ఆ విధంగానైనా విజయేశ్వరవర్మ తన అభిప్రాయం వ్యక్తీకరించినందుకు మంత్రిగుప్తుడెంతైనా సంతోషించాడు. వెంటనే మార్తాండభట్టు గృహానికి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం విందు భోజనం ముగించి తాంబూల చర్వణ చేస్తూన్న కాళిదాస మహాకవి కల్లంత దూరంలో సందర్శించగానే మంత్రిగుప్తుడు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

తేజస్వి, స్ఫురద్రూపి, అయిన ఆ వ్యక్తి కాళిదాస మహాకవే అయి ఉండవచ్చునని అనుకొన్నాడు. వెంటనే మార్తాండభట్టు మహామాత్యుణ్ని కవి సన్నిధికి తీసుకు పోయాడు. మహాకవిని చూస్తూనే మంత్రిగుప్తుడెంతో మర్యాదగా ప్రసంగం ప్రారంభించాడు:

"మీవంటి మహాకవులు కుంతలాస్థానం సందర్శించడం కేవలం మాభాగ్యమే!"

కాళిదాసకవి తాంబూల సేవకొంచెం విరమించాడు:

"కుంతలేశ్వరులు మహా విద్వాంసులనీ కవీశ్వరులనీ, రసజ్ఞులనీ విక్రమాదిత్యులు ప్రశంసించగా విని వారి నొక్కమారు సందర్శించి పోదామని వచ్చాను."

ఆమాటతో మంత్రిగుప్తుని హృదయంలో ఆశారేఖ రేకెత్తింది.

"వారెంతో కాలంగా మీ కవితామృతం మీ ముఖతః ఆస్వాదించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఆ మహాభాగ్యం నేటికిలాగ ఫలించింది."

ఆ ప్రత్యుత్తరంతో కవి హృదయంలో కూడా ఆశాలేశం వెలిగింది:

"ఆభాగ్యం వారిదికాదు, నాది."

తరవాత ఆ సౌమనస్యధోరణి గ్రహించి మంత్రిగుప్తుడు కవిని అపాయంకాలమే రాజప్రాసాదానికి విచ్చేయవలసిందనీ కుంతల దేశాధీశునికి కవితామృతాస్వాద భాగ్యం కలిగించవలసిందనీ ప్రార్థించాడు.

౪

రాజప్రాసాదంలో కవితాగోష్ఠి సన్నాహం జరిగింది రత్నకంబళాలు పరిచిన సభాస్థలిలో ప్రసిద్ధ కళ్యాణపుర కవి విద్వాంసులందరు సమాసీనులైనారు.

పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్ని, నీ సరియైన చర్య గురించిన్ని నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టు కార్డు పైన నీ కిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీసరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోను నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీవు జయముకలుగును. నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము. తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మా ద్ద్రవ్యలాభం మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపుడు చేయబడును వివరములు మా పూచీపైని పంపబడును. మేము పంపిన భోగటా నీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Shree Swami Satyanarain, Raj Jyotishi, (WPA) Phagwara (Pb.)

★ మహాకవి సింహాసనం ★

కుంతలాధిపతి విజయేశ్వరవర్మ ప్రత్యేకంగా తన కేర్పాటయిన రత్నకంబళంమీద హంసతూలికలతో అమర్చిన ఒక తలగడ కానుకని కాళిదాసాగమనం నిరీక్షిస్తూ కూర్చున్నాడు.

కాళిదాసకవి సభాస్థలి సింహద్వారంలో ప్రవేశించగానే మంత్రిగుప్తు డతనికెదురేగి సగౌరవంగా లోపలికి తోడుకుపోయాడు. విజయేశ్వరవర్మ అది చూచి లేవబోయినట్లు నటించి తన కలవాటైన ధోరణిలో ప్రత్యేకమైన గౌరవం జరిపాడు. అంతేగాని లేచి నిలబడలేదు. సభాస్థలిలో ప్రవేశిస్తూనే కాళిదాసకవి ఒక్క చూపులో అదంతా ఆకళించుకొన్నాడు.

మంత్రిగుప్తు డది గ్రహించాడు. కాని కాళిదాసకవి అది గ్రహించలేదని అనుకొన్నాడు.

నిజానికి విజయేశ్వరవర్మ అది చెయ్యవలెనని చేసిన అమర్యాదకాదు. తన ఆస్థాన మర్యాద ప్రకారమే అతడా విధంగా అతిథి గౌరవ మర్యాద నడిపించాడు.

మంత్రిగుప్తుని కది కొంచెం అనుచితంగానే కనిపించింది. అయినా అత నదది పైకి కనబడనీయకూడదనుకొని కాళిదాసకవిని విజయేశ్వరవర్మ సరసనే కూర్చోబెట్టవలెనని సంకల్పించి సగౌరవంగా మహారాజు సన్నిధికి తోడుకుపోయాడు.

విజయేశ్వరవర్మ అప్పటికి తన తప్పిదం గుర్తించాడు. వెంటనే కవిని తన సరసనే కూర్చోవలసిందని ప్రార్థించాడు.

కాని కవి ఎక్కడా చెక్కుచెదిరినట్లు కనబడలేదు. అల్లాగే ఉల్లాసంగా నవ్వుతూ విజయేశ్వరునికి కొంచెం సమీపంలో రత్నఖచితమైన ప్రదేశంలో కూర్చున్నాడు. అంతేనేగాని రత్నకంబళంమీద కూర్చోలేదు.

అది రత్నఖచితమైన ప్రదేశమే అయినా మహాకవి ఆ విధంగా వట్టి నేలపై కూర్చోవడం మంత్రిగుప్తునికి రుచించలేదు. వెంటనే విజయేశ్వరవర్మ ఆ సంగతి గ్రహించి కవిని తన రత్నకంబళంమీదికి విచ్చేయవలసినదని సగౌరవంగా ఆహ్వానించాడు.

కాని మహాకవి అక్కడినించి కదలనే లేదు. అలాగే చిరునవ్వుల మల్లెపూల పుష్పాంజలి విరజిమ్ముతూ ఆ ప్రార్థనకు ప్రత్యుత్తరంగా ఒక శ్లోకం పఠించాడు. అసలు కవి స్ఫురద్రూపం చూడగానే సభ్యులందరు చిత్రప్రతిమలై పోయారు.

తీయతీయని ఆ మహాకవి గొంతు వినిపడగానె సభాస్థానులందరికీ మరి శరీరాల మీద స్పృహలే సడలిపోయాయి:

"ఇహ నివసతి మేరుః శేఖరః క్ష్మాధరాణాం
ఇహ వినిహితభారాః సాగరాః సప్తచాన్యే
ఇద మహిపతి భోగ స్తంభరత్నాభిరామం
అవనితల మిహైవ స్థానమస్మద్విధానాం"

"పర్వతాలకు ప్రభువైన మేరువీ భూతలం మీదనే నివసిస్తున్నాడు. సప్త సాగరాలు ఇక్కడే కొలువుదీరి కూర్చున్నాయి. ఆదిశేషుని పడగలనే స్తంభాల రత్నాలతో సమలంకృతమైన అవనితలమే మావంటి వారికి స్థానం. ఇదే మా సింహాసనం."

ఆ శ్లోకపఠనం పూర్తికాగానే విద్వన్మండలిలో భోరుమని సాధువాదాలు చెలరేగాయి.

మంత్రిగుప్తు డా శ్లోకార్థం కొంచెం మననం చేసుకొన్నాడు: "దీనిలో ఎంతటి వ్యంగ్యమున్నది! మహాకవి తన సహజ వినయ ధోరణిలో తనకు రత్నకంబళాలవంటి రాజాసనాల అవశ్యకత లేదనీ కేవలం ఆస్తరణ శూన్యమైన అవని తలమే తన సింహాసనమనీ అన్నాడు! కాని గభీరమైన వ్యంగ్య ధోరణిలో తాను సప్త సాగరాలతోను, మేరువుతోను సమానుడనని ధ్వనింపజేశాడు. ఆ శ్లోకంలో పైపైకి వినయమే గోచరించింది. కాని దాని అర్థం తరించిన కొద్దీ కవిచక్రవర్తి ఉచితమైన రాజసంకూడా గభీరంగా ధ్వనించింది. కనకనే విక్రమాదిత్య చక్రవర్తి ఆయన కర్ధాసనమిచ్చి గౌరవించటం జరిగింది!" అని అనేక విధాలా ఆ మహాకవి కవితాచాతుర్యాన్ని కొనియాడాడు.

విజయేశ్వరవర్మకూడా ఆ గభీరవ్యంగ్యం గ్రహించుకొన్నాడు. ఆ శ్లోకంలో అతనికింకొక వ్యంగ్యంకూడా స్ఫురించింది.

విక్రమాదిత్య చక్రవర్తి సింహాసనం సన్నిధిని భూతలం మీద కూర్చున్నా తన రాజ గౌరవాదరాలకేమి లోపం రాదని అతనికా క్షణంలో ఒక మెరుపులా ధ్వనించింది.

వెంటనే లేచి కాళిదాస మహాకవినితాను కూర్చున్న రత్నకంబళం మీద కూర్చోబెట్టుకొన్నాడు. సవినయంగా తానా మహాకవి పాద సన్నిధిని కూర్చున్నాడు. మణిభూషణాంబరాలతో కాళిదాసకవికనేక విధాలుగా మహారాజ సత్కారాలు జరిపించాడు.

కుంతలేశ్వరుని హృదయంలో జరిగిన ఆ పరివర్తన గమనించిన మంత్రిగుప్తుని కాక్షణంలో ఎంతో సంతోషం కలిగింది.

అటుపిమ్మట మరి నాలుగైదు రోజులవరకు కుంతలరాజాస్థానం కాళిదాస కవితామృత ధారలలో ఓలలాడింది. ఆ ఉత్సవాలలో విజయేశ్వరవర్మ, కాళిదాస కవి, మంత్రిగుప్తుడు చిరకాల పరిచితులైన మిత్రుల ధోరణిలోనే వ్యవహరించారు. మంత్రిగుప్తుడు కాళిదాస కవి వాక్చాతుర్యాన్ని కొనియాడాడు.

క్రమంగా తన హృదయ సంకల్పం కుంతలేశ్వరుని కెరిగించాడు. విక్రమాదిత్యుని సంకల్పం ఫలించడానికి కావ్యయుంలో కాళిదాసకవి కవితాచాతుర్యంతోబాటు వ్యవహారచాతుర్యంకూడా బాగా తోడ్పడింది.

కవితోత్సవం పరిసమాప్తికాగానే విజయేశ్వరవర్మ, విక్రమాదిత్య చక్రవర్తి వియ్యమందబోతున్నారన్న శుభవార్త కళ్యాణ నగరంలో అంతటా మారుమోగింది. ★